క్లుప్తంగా

బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడి



సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామంలో మహ్మద్ రఫీక్ నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఏఈసీ మధుసూదన్ వివరాలు వెల్లడించారు. శనివారం రాత్రి దాడి చేసి రూ.6,280 విలువైన మద్యం స్వాధీనం చేసుకునట్టు తెలిపారు. తదుపరి చర్యల కోసం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై నాసర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారీ కేంద్రంపై..

సంగెం : మండలంలోని పల్లారుగూడలోని నిషేధిత గుడుంబా తయారీ కేంద్రంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై సీతారాములు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన రాయపురం సమ్మక్క పల్లారుగూడ శివారులో గుడుంబా తయారీ చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్టు తెలిపారు. గుడుంబా తయారీకి ఉపయోగించే 50 లీటర్ల బెల్లం పానకాన్ని, సామగ్రిని ధ్వంసం చేసి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. డాడిలో కానిస్టేబుల్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ మహమూద్ నాన్నమ్మ యాకూబీ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి ఆ పార్టీ నాయకులు ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహమూద్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, నాయకులు రెంటాల గోవర్ధన్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, సరికొండ కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకన్న, ఇల్లందుల భగవాన్, మందాటి సుదర్శన్‌రెడ్డి, మచ్చ రమేశ్, చిర్ర మల్లయ్య, మచ్చ కుమారస్వామి, గుగులోతు శ్రీను, అఫ్రోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



చెన్నారావుపేట: మండల కేంద్రంలోని నంబర్ వన్ కాలనీకి చెందిన మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సాధు నర్సంగరావు సోదరుడు చిరంజీవి ఇటవల మృతి చెందగా బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు కంది కృష్ణ చైతన్యరెడ్డి ఆదివారం 50 కేజీల బియ్యం సాయంగా అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్మెట్ట సాంబయ్య, యువజన సంఘం అధ్యక్షుడు బారెపాకా నవీన్, నాయకులు జంగిలి పాణి, అనుముల మల్లయ్య, మందుల సాగర్, ఆకులపెల్లి సుదర్శన్, సింగిరెడ్డి అనిల్, అలవాల ప్రశాంత్, జంగిలి సతీశ్, పవన్, కేశవ్ పాల్గొన్నారు.

ఎస్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాధన్నపేటకు చెందిన సోమ సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్‌కే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశెట్టి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం 50 కిలోల బియ్యం సాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గంగుల రంజిత్, పుప్పాల కల్యాణ్, పోలబోయిన నరేశ్, కేశెట్టి పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశ అర్హత పరీక్షకు బారులుదీరిన విద్యార్థులు



రాయపర్తి : జిల్లాలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన (సీఓఈసెట్) అర్హత పరీక్షకు మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ వద్ద విద్యార్థులు బారులు తీరారు. దీంతో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి రద్దీగా మారింది. మొత్తం 480 మంది విద్యార్థులకు గాను 457 మంది పరీక్ష కోసం హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్ తెలిపారు.

లీజుకు వ్యవసాయ పరికరాలు!

- ప్రైవేట్ వ్యక్తి చేతుల్లోకి యంత్రాలు
- పేద రైతులకు అందుబాటులో లేని పనిముట్లు



స్వర్ణభారతి మండల సమాఖ్యకు ట్రాక్టర్‌ను అందిస్తున్న అధికారులు (ఫైల్)



మండల సమాఖ్యకు అందించిన యంత్రాలు (ఫైల్)

రాయపర్తి: వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు మండల కేంద్రంలోని స్వర్ణ భారతి మండల సమాఖ్యకు గత ప్రభుత్వం 2020–21 ఆర్థిక సంవత్సరంలో పైలట్ ప్రాజెక్టుగా ట్రాక్టర్‌తోపాటు యంత్రాలను అందించింది. ఎస్ఆర్ఎల్ఎం, సెర్ప్ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా 100 సీహెచ్‌సీ (కస్టమర్ హియరింగ్ సెంటర్లు)లను నెలకొల్పింది. ఈ క్రమంలో మండల సమాఖ్యకు రూ.19 లక్షల వ్యయంతో ట్రాక్టర్ ఇంజన్‌తోపాటు ట్రాలీ, రోటోవేటర్, గడ్డిచుట్టే యంత్రం, ఫ్లవ్వు, విత్తనాలు వేసే యంత్రం, కల్టివేటర్, మొక్కజొన్నలు పట్టే తదితర యంత్రాలను కొనుగోలు చేసి మండల సమాఖ్యకు అందించింది. అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, అధికారులు వీటిని ప్రారంభించారు. ఆ పనిముట్లను తక్కువ ధరకు పేద రైతులకు అద్దెకు ఇస్తూ నిర్వహించాలనే ఈ పథకం ఉద్దేశం. ప్రస్తుత మంత్రి ధనసరి సీతక్క కూడా ఈ పథకంపైనే తొలి సంతకం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పథకాన్ని అమలు చేస్తామని కూడా ప్రకటించారు.

విక్రయించారా.. లీజుకిచ్చారా!

ప్రభుత్వం అందించిన ఆ యంత్రాలను మండల సమాఖ్య ఆధ్వర్యంలో రైతులకు అద్దెకు ఇవ్వాల్సి ఉంది. కానీ, మండలంలోని సన్నూరు జయరాం తండాకు చెందిన ఓ వ్యక్తికి ట్రాక్టర్‌తోపాటు అన్ని పనిముట్లను అమ్మినట్లు సమాఖ్య భవనంలో చర్చించుకుంటున్నారు. సదరు వ్యక్తిని వీటి గురించి అడిగితే లీజుకు ఇచ్చారని చెబుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనిముట్లను సమాఖ్య కార్యాలయానికి తరలించి అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

తుప్పపట్టడంతో లీజుకు ఇచ్చాం..

భవనంలో ఉన్న ట్రాక్టర్, పనిముట్లను జయరాం తండా(ఎస్)కు చెందిన నరేందర్‌కు లీజుకు ఇచ్చాం. అగ్రిమెంట్ పేపర్ ఉంది. సమాఖ్యకు చెందిన మహిళలు నిర్వహించకపోవడంతో పరికరాలు తుప్పుపడుతున్న దుస్థితి నెలకొంది. నర్సంపేట, గీసుకొండతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఏందిజ అందుకే లీజుకు ఇచ్చాం. అవసరమైతే లీజును రద్దు చేసి పరికరాలను తీసుకొస్తాం.

– కిరణ్‌కుమార్, ఏపీఎం

నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపిక అభినందనీయం



అరుణ, విపంచిలను సన్మానిస్తున్న రవికుమార్

- లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవికుమార్

నర్సంపేట : విపంచి, అరుణ నర్సింగ్ ఆఫీసర్లు ఎంపికవడం అభినందనీయమని లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ అన్నారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపంచి, అరుణలను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. పూర్వవిద్యార్థులు విపంచి, అరుణ పట్టుదలకు ప్రతిరూపాలని తెలిపారు. అనేక కష్టనష్టాలకోర్చి విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారని చెప్పారు. ప్రణాళికాయుతంగా చదివి నర్సింగ్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులు బాల్యం నుంచే తల్లిదండ్రులు, గురువులు మార్గదర్శకత్వంలో ప్రణాళిక ప్రకారం సిద్ధపడతే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని చెప్పారు. విపంచి, అరుణల తల్లిదండ్రులను అభినందించారు. మూడో తరగతిలోనే తండ్రిని కోల్పోయినా అరుణ పట్టుదలతో చదివి ఎమ్మెస్సీ నర్సింగ్ పూర్తి చేసిందంటూ ఆమెను, అన్ని విషయాల్లో తోడునీడగా వెన్నంటి నిలిచిందంటూ తల్లి ఉమను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లీడ్ గ్రంథాలయ నిర్వాహకురాలు కాసుల శోభ రవికుమార్, ప్రభుత్వ గెజిటెడ్ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉమ, స్వరూప, రామస్వామి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన భవ్య మృతదేహం



ఖానాపురం : ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఉరేసుకుని చనిపోయిన భవ్య (12) మృతదేహం మండలంలోని స్వగ్రామమైన బుధరావుపేటకు చేరుకుంది. బుధరావుపేటకు చెందిన కోడి కృష్ణ–లలిత దంపతుల కూతురు భవ్య. వారి కుటుంబం పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లింది. హబ్సీగూడలో ఉంటున్నారు. పండగల సమయంలో బుధరావుపేటకు వచ్చి వెళ్తుంటారు. ఈ క్రమంలో భవ్యను ఎస్సీ బాలికల వసతి గృహంలో మూడో తరగతి నుంచి చదివిస్తున్నారు. కాగా వసతి గృహంలోనే శనివారం ఆమె ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భవ్య మృతదేహాన్ని తల్లిదండ్రులు బుధరావుపేటకు తీసుకొచ్చారు. దీంతో కుటుంబంతోపాటు గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. బాధిత కుటుంబాన్ని నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రావు, ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మోడెం ఎల్లాగౌడ్, తదితర కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. భవ్యకు అంత్యక్రియలను నేడు (సోమవారం) నిర్వహించనున్నారు.

చట్టసభకు ప్రశ్నించే గొంతుకను పంపాలి



అభివాదం చేస్తున్న నాయకులు

నర్సంపేట : చట్టసభకు ప్రశ్నించే గొంతుకను పంపించాలని టీపీసీసీ సభ్యుడు, సీనియర్ నాయకుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ కోరారు. పట్టణంలోని ఐఎంఏ హాలులో భూక్య జగన్‌నాయక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు తేజావత్ వాసునాయక్, గుగులోతు భీమానాయక్ హాజరవగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో 25 ఏళ్లుగా ఉంటూ పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి, సామాజిక సేవలకు పెద్దపీట వేస్తున్నట్టు తెలిపారు. పేదల తలరాత మారాలన్నా, ప్రజల జీవన విధానం మెరుగుపడాలన్నా చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకగా తనను పంపాలని కోరారు. సమావేశంలో సామాజిక కార్యకర్తలు, రాష్ట్ర, జిల్లా నాయకులు అరుణబాయి, వాంకుడోతు మంగీలాల్, సంతోశ్ నాయక్, సుభాష్, గుగులోతు మంగీలాల్, శ్రీనివాస్, వెంకన్న, రమేశ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతో కేంద్రానికి గుణపాఠం



సమావేశంలో మాట్లాడుతున్న ఈసంపెల్లి బాబు

నర్సంపేట : ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు శ్రేణులకు సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బుర్రి ఆంజనేయులు అధ్యక్షతన పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్మిక, కర్షక మండల సదస్సుకు బాబు హాజరై మాట్లాడారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గడచిన పదేళ్లలో అనుసరించిన తప్పుడు విధానాలతో దేశం దివాలా తీసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక మతోన్మాద విధానాలను ప్రజలకు వివరించేలా ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేయాలని శ్రేణులకు సూచించారు. రైతాంగానికి, కార్మిక వర్గానికి, వ్యవసాయ కార్మికులకు బీజేపీ ప్రభుత్వంతో ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోరబోయిన కుమారస్వామి, నాయకులు కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, పెండ్యాల సారయ్య, రుద్రారపు లక్ష్మి, కత్తి చిన్న కట్టయ్య, గట్ల నర్సింహరాములు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పాలకవర్గ సేవలు మరువలేనివి



మాజీ పాలకవర్గంతో కోఆప్షన్ సభ్యుడు, తదితరులు

పర్వతగిరి : సీకేతండా గ్రామ అభివృద్ధిలో మాజీ పంచాయతీ పాలకవర్గ సేవలు మరువలేనివని జిల్లా కోఆప్షన్ సభ్యుడు సర్వర్ తెలిపారు. మండలంలోని సీకేతండా మాజీ సర్పంచ్, ఇతర పాలకవర్గాన్ని, కార్యదర్శిని ఆదివారం శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్వర్ మాట్లాడారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచ్, పాలకవర్గం విశేష కృషి చేసిందని చెప్పారు. ప్రజాప్రతినిధులు ప్రజాసేవలో ఉంటేనే మన్ననలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శాంతమ్మ, మాజీ సర్పంచ్ రమేశ్‌నాయక్, కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విప్లవోద్యమమే ఎజెండాగా ఐక్యత



నర్సంపేట : విప్లవోద్యమమే ఏకైక ఎజెండాగా విప్లవ పార్టీలు ఏకమౌతున్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పసునూటి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అడ్డూరి రాజు తెలిపారు. మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) పీసీసీ, సీపీఐ(ఎంఎల్) ఇనీషియేటివ్ రెవల్యూషనరీ పార్టీ తలపెట్టిన జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పసునూటి రాజు, అడ్డూరి రాజు మాట్లాడారు. ఆ మూడు పార్టీలు విప్లవోద్యమమే ఎజెండాగా ఐక్యం అవుతున్నాయని తెలిపారు. దేశంలో ఒకే అతిపెద్ద విప్లవ పార్టీగా ఏర్పడుతున్నట్టు చెప్పారు. ప్రధాని మోదీ నియంతృత్వ పాలన సాగిస్తున్నాడని విమర్శించారు. శ్రీరాముడు పేరుతో దేశాన్ని వెనకడుగు వేయిస్తూ అంబానీ, అదానీలకు లబ్ధి చేకూర్చేలా తప్పుడు విధానాలు అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బానోతు జవహర్‌లాల్, డివిజన్ నాయకుడు అడ్డూరి మనోహర్, నాయకులు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో 'ఉపాధి' కల్పించాలి

- డీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల్లో ఉపాధి హామీ చట్టానికి సవరణ చేసి మున్సిపాలిటీల్లోనూ గ్రామీణ పేదలకు పనులు కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా కూలీలు పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి లభించక వలస పోతున్న దుస్థితి నెలకొందని చెప్పారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఉద్యమించిన వారికి నెలకు రూ.25 వేల భృతి అందించాలని, 250 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో ఉపాధి పనులు కల్పించేలా ఈనెల 9న జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. సమావేశంలో నాయకులు చల్లా మిధున్, బి.బాబు, కొండేటి రాంచంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటు నమోదును ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్

దుగ్గొండి : అర్హత కలిగిన పట్టభద్రులు ఈనెల 6లోగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ పట్టభద్రుల ఎన్నికల ఇన్‌చార్జ్ శానబోయిన రాజ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2020 నవంబర్ నాటికి డిగ్రీ, ఆపై చదువు పూర్తి చేసిన యువకులు ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు గుండెకారి రంగారావు, పోగాకు బాలకృష్ణ, కొల్లూరి మోహన్‌రావు, సింగతి కార్తీక్, కక్కెర్ల ప్రమోద్, సముద్రాల విజేందర్, కందిపల్లి శంకర్, శ్రావణ్, పల్లె రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు స్థలాలు, ఇళ్లు ఇస్తాం



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

నర్సంపేట : అర్హులైన జర్నలిస్టులకు స్థలాలిచ్చి ఇళ్లు మంజూరు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. జర్నలిస్టులకు స్థలాలు కేటాయించాలని, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ పట్టణంలోని పాకాల జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరెడ్డిని స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి మాట్లాడారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి నడుమ వారధిగా ఉంటూ నిత్యం సమాచారాన్ని అందిస్తున్న జర్నలిస్టులను విస్మరించేది లేదని స్పష్టం చేశారు. జూన్‌లో అందుకు అనుగుణంగా ఇళ్ల స్థలాల పట్టాలను అందిస్తానని హామీ ఇచ్చారు. గతంలో కేటాయించిన భూమిలో స్థలాల కేటాయింపులో క్లారిటీ లేకపోవడంతో మెడికల్ కళాశాలకు బదిలీ అయినట్టు తెలిపారు. స్థలాల పట్టాలు ఇవ్వడంతోపాటు ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



పైడయ్యను శాలువాతో సత్కరిస్తున్న రాములు

నర్సంపేట : కేంద్రంలోని బీజేపీ అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి, భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు వంగూరు రాములు కోరారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో రుద్రారపు పైడయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాములు మాట్లాడారు. కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు కార్మికులను కట్టు బానిసలుగా మార్చే కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ బ్యాంకుల్లో లక్షల కోట్ల రుణాలు తీసుకున్న విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ, లలిత్‌మోడీ, తదితరులకు 12 లక్షల కోట్లు కరోనా కాలంలో మాఫీ చేసి పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపుతోందని చెప్పారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కమిటీని అభినందిస్తూ అధ్యక్షుడు రుద్రారపు పైడయ్యను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతగిరి రవి, పట్టణ ఉపాధ్యక్షుడు ఓదెల చంద్రయ్య, నాయకులు దేవాన్ల రాంబాబు, కానుగంటి రాజన్న, సహాయ కార్యదర్శి అడప వేణుగోపాల్, కోశాధికారి కందికొండ రాజు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సురేందర్

నర్సంపేట రూరల్ : పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని ఏబీసీడబ్ల్యూఓ ఎం.సురేందర్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహం ఆధ్వర్యంలో వార్డెన్ పరమాండ్ల భాస్కర్‌రావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ప్రేరణ శిక్షణ సదస్సుకు నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, సంగెం, పర్వతగిరి, గీసుగొండ బీసీ వసతిగృహాల విద్యార్థులు హాజరవగా సురేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా చూడాలని చెప్పారు. ప్రణాళికాయుతంగా అభ్యాసం చేయించాలని తెలిపారు. పరీక్షల ముందు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 10 జీపీఏ సాధించేలా చొరవ చూపాలని చెప్పారు. సదస్సులో ఉపాధ్యాయులు రవి, వీరన్న, రాకేశ్, అర్జున్ పాల్గొన్నారు.

అడుగడుగున గుంతలు.. నడక నరకప్రాయమే



గుంతలు తేలిన తిమ్మాపూర్–ఎల్గూర్ స్టేషన్ రోడ్డు



తొమ్మిది మోరీల కాజ్‌వేపై ఏర్పడిన గొయ్యి

సంగెం : మండలంలోని తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్ స్టేషన్, తూర్పు తండా మీదుగా నెక్కొండ మండలంలోని చంద్రుగూడెం వెళ్లే బీటీ రోడ్డుకు అడుగడుగునా గుంతలు పడి ప్రయాణికులు నడక సాగించడమూ నరకప్రాయంగా తయారైంది. ఈ బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. అడుగడునా గుంతలు తేలి కాలినడక సాగించడమూ కష్టంగానే ఉంది. రోడ్డుపై ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లు నడుం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణం సాగించాలంటే బెంబేలెత్తుతున్నారు. ఇదిలా ఉండగా తొమ్మిది మోరీల లోలెవల్ కాజ్‌పై గుంత మరింత ప్రమాదకరంగా తయారైంది. అసలే గుంత.. ఆపై మూలమలుపు.. అదమరిస్తే అంతే.. ఆస్పత్రి పాలవడం ఖాయమన్న వ్యాఖ్యలు సర్వసాధారణమైపోయాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డును రెన్యూవల్ చేయడంతోపాటు తొమ్మిది మోరీల లోలెవల్ కాజ్‌వేపై ఏర్పడ్డ గుంతను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'నాలుగో తరగతి' సంఘం కమిటీ ఎన్నిక



చెన్నారావుపేట:రహ్మత్‌ను సన్మానిస్తున్న సభ్యులు



రాయపర్తి: రాజు, అనిల్‌ను సన్మానిస్తున్న సభ్యులు

చెన్నారావుపేట : పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం మండల కమిటీని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అడహక్ కమిటీ అధ్యక్షుడు సంతోశ్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా సయ్యద్ రహ్మత్, అసోసియేట్ అధ్యక్షుడిగా వీర్య, ఉపాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా చరణ్ కృష్ణ, కోశాధికారిగా నీల, సహాయ కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోఆప్షన్ సభ్యులుగా శంకరయ్య, మంజుల, మహిళ విభాగం సమితి అధ్యక్షురాలిగా స్వర్ణలత, ప్రధాన కార్యదర్శిగా శైలజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రహ్మత్‌ను సన్మానించారు. ఎన్నికల అధికారిగా ఎర్ర శ్రీనివాస్, జిల్లా అడహక్ కమిటీ కార్యదర్శిగా బోలే షావలీ వ్యవహరించగా నర్సంపేట సమితి అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి వనజ, పూర్ణచందర్, వెంకన్న, చంద్రకళ పాల్గొన్నారు.

అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల..

రాయపర్తి : మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబూజగ్జీవన్ రామ్ విగ్రహాల, అంబేడ్కర్ యువజన సంఘం కమిటీలను ఆదివారం ఎన్నుకున్నారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల కమిటీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఐత రాజును ఎన్నుకున్నారు. అలాగే ఎస్సీ కాలనీ అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ అధ్యక్షుడిగా ఐత అనిల్, ప్రధాన కార్యదర్శిగా పీరని రాజబాబు, ఉపాధ్యక్షుడిగా ఐత రంజిత్, కోశాధికారిగా కంతుల శరణ్, సహాయ కార్యదర్శిగా ఐత భాస్కర్, సమాచార కార్యదర్శిగా ఐత మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాజు, అనిల్‌లను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఐత రాంచందర్, గౌరవ అధ్యక్షుడు ఐత యాకయ్య, నాయకులు ఐత బ్రహ్మం, గడ్డం కుమార్, ఐత మల్లేశ్, ఐత బాబులాల్, ఐత శంకర్, పీరని రాజు పాల్గొన్నారు.